క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం అందజేత

ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంను శనివారం హెచ్ఎం రేవతి, ఎస్ఎంసీ చైర్మన్ సుజాత పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు పాఠ్య పుసకాలు అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు ఉన్నాయన్నారు.

వెంకన్న సన్నిధిలో డీఎస్పీ పూజలు



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో డీఎస్పీ రంగస్వామి ప్రత్యేకపూజలు చేశారు. శనివారం కావడంతో ఆయన ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ సిబ్బంది ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు ట్యాబ్స్ పంపిణీ



కేటీదొడ్డి: ఐసీటీలో భాగంగా జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆన్‌లైన్ సేవల నమోదు సౌకర్యార్థం ట్యాబ్స్ పంపిణీ చేస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారులు హంపయ్య, ఎస్తేర్‌రాణి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ట్యాబ్స్ అందజేశారు. కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ కార్యాలయ పర్యవేక్షకులు సీతారామారావు, టెక్నికల్ ఇన్‌చార్జ్ శివ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: వడ్డేపల్లి, రాజోళి, అయిజ మండలాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంఈఓ నర్సింహులు, సమన్వయ అధికారి శాంతిరాజు, నోడల అధికారి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ట్యాబ్‌లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశం మండలంలోని వెంకటాపురంలో ఎంఈఓ నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు.

కాల్వలను శుభ్రం చేసుకున్న రైతులు



రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో శనివారం రైతులే స్వచ్ఛందంగా కాల్వలను శుభ్రం చేసుకున్నారు. పొలాలకు నీరందించే కాల్వల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని రైతులే చందాలు వేసుకుని తొలగించారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కాల్వలో అడ్డు ఉంటే నీటి పారుదలకు ఇబ్బందులు ఉంటాయని ముందస్తుగా రైతులు చర్చించుకుని ఈ పనులు చేపట్టారు. అవసరమైన గడ్డి మందులు పిచికారి చేసి, పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే ఆర్డీఎస్ కాల్వలు, లింకు కెనాల్‌లో ఈ పనులు చేపట్టారు.

లౌడ్ స్పీకర్లు వాడొద్దు



అయిజ: ట్రాక్టర్లకు లౌడ్ స్పీకర్లు పెట్టుకోవద్దని ఎస్ఐ నరేష్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో లౌడ్ స్పీకర్లతో వెళ్తున్న ట్రాక్టర్లపై ఎస్ఐ శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా లౌడ్ స్పీకర్లను ధ్వంసం చేశారు. అనంతరం డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునుగాలలో శనివారం సీఎస్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని లేబర్ కార్డు కలిగి ఉన్న 28 మంది కార్మికులకు డాక్టర్ ఫరూక్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని లేబర్ కార్డు కలిగిన ప్రతి కార్మికుడు వినియోగించుకోవాలని సీఎస్‌సీ జిల్లా కోర్డినేటర్ ప్రశాంత్‌కుమార్ సూచించారు.

ఒత్తిడిలో సరిహద్దు పోలీసులు

- ఏళ్ల తరబడి అటాచ్ పద్ధతిలోనే సిబ్బంది
- 12 గ్రామాలకు 8 మంది..
- కుటుంబాలకు దూరంగా రోజుల తరబడి
- బందోబస్తు, పెట్రోలింగ్‌లతో ఉక్కిరిబిక్కిరి



రాజోళిలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజోళి: సరిహద్దు పోలీస్‌స్టేషన్‌లో రెగ్యులర్ సిబ్బంది లేక పోలీసులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహిస్తూ పది రోజులకు ఒక సారి కుటుంబాలను చూసుకునేందుకు కూడా వీలు లేకుండాపోయిందని బాహాటంగానే తెలుపుతున్నారు. మండల పోలీస్‌స్టేషన్‌కు ఏళ్ల చరిత్ర ఉన్నప్పటికీ, నేటికి సరైన సిబ్బందిని కేటాయించకపోవడంతో మండలంలో పర్యవేక్షణ కరువైంది. సరిహద్దులో నకిలీ విత్తనాలు, అక్రమ మద్యం అడ్డుకట్ట సవాల్‌గా మారింది.

12 గ్రామాలకు అందుబాటులో..

మండలంలోని 11 గ్రామాలతో పాటు వడ్డేపల్లి మండలంలోని బుడమరుసు రాజోళి పోలీస్‌స్టేషన్ పరిధిలో వస్తుండడంతో మొత్తం 12 గ్రామాలకు ఈ స్టేషన్ ద్వారానే సేవలందుతున్నాయి. గతంలో పిర్కాలుగా పిలవబడే రోజుల నుంచి రాజోళిలో ఔట్‌పోస్టు ఉన్నప్పటికీ, 2009లో కొత్త పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభించారు. 2016లో జిల్లాల ఏర్పాటు అనంతరం మండలంగా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా పూర్తి స్థాయి సిబ్బంది కేటాయింపు లేకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే భారం పడుతుందని పోలీసులు ఆవేదన వ్యకం చేస్తున్నారు.

అటాచ్‌లతోనే సరి..

పోలీస్ స్టేషన్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు అటాచ్‌పైనే వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నలుగురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు ఉండగా, ఉన్న సిబ్బందిలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు శాంతినగర్ స్టేషన్ నుంచి, ఇద్దరు కానిస్టేబుళ్లు మానవపాడు పోలీస్ స్టేషన్ నుంచి అటాచ్‌పై వచ్చారు. మొత్తం 12 మంది సిబ్బందికి, ప్రస్తుతం 8 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన ఐదుగురు సిక్ లీవ్‌లో ఉన్నారు. విధులు నిర్వహిస్తున్న వారందరూ కూడా ఇతర పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన వారే. అందులో ఎస్ఐ కూడా ఉండటం విశేషం. దీనికి తోడు ప్రస్తుత ఎస్ఐ రాజోళి పోలీస్ స్టేషన్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలో అటాచ్‌లో విధులకు రాగా ఆయనను బదిలీ చేస్తూ ఉత్తర్వులు రావడంతో మండల ప్రజలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన వారు 6నెలలు కూడా ఉండకుండా వెళ్లడం, మళ్లీ కొత్తగా వచ్చిన వారు మండలం గురుంచి తెలుసుకునేలోగా బదిలీ కావడం సాధారణమైపోయిందని అంటున్నారు.

పెరుగుతున్న పని ఒత్తిడి..

మండలంలో 12 గ్రామాలకు 8 మంది సిబ్బందితో సేవలందించేలేక స్టేషన్ సతమతమవుతుంది. ప్రత్యేకంగా బందోబస్తు, పెట్రోలింగ్, కోర్టు డ్యూటీలకు సిబ్బంది వెళితే స్టేషన్‌లో సిబ్బంది లేక కొన్ని సమయాల్లో ఒక్కరే ఉండాల్సి వస్తుంది. వారికి కనీసం భోజనం తెచ్చుకునేందుకు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. అదే వ్యక్తికి అనారోగ్యం సమస్య వచ్చినా, ఇంటి నుంచి అత్యవసరమైన వెళ్లలేరు. సరిహద్దులో ఉండటంతో నకిలీ విత్తనాలు, అక్రమ మద్యం, ఇసుక రవాణా వంటి వాటిపై నిరంతరం నిఘా ఉంచాలంటే, సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే అదనంగా బాధ్యత పడుతుందని, అదనంగా సిబ్బందిని కేటాయించడంతో పాటు, అటాచ్ విధానంపై కాకుండా రెగ్యులర్ సిబ్బందిని కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఆటంకం కలగకుండా గ్రామాలు శాంతియుత వాతావరణంలో ఉంటాయని ప్రజలు అంటున్నారు.

అటాచ్‌పైనే వచ్చారు



నేను ఎస్ఐగా వీఆర్ ద్వారా వచ్చాం. ప్రస్తుతం ఉన్న సిబ్బంది కూడా మానవపాడు, శాంతినగర్ నుంచి అటాచ్‌పై వచ్చారు. సిబ్బంది కొరత వల్ల కొందరు ఉద్యోగులు కొన్ని ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. సరిహద్దులో ఉండటం వల్ల పలు రకాల విధుల భారం ఉంటుంది. ఉన్న సిబ్బందికే అదనపు పని ఒత్తిడి పడుతుండటంతో కుటుంబంతో గడిపేందుకు కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినా చూపెట్టుకునేందుకు కూడా సమయం లేని పరిస్థితి.

– సీహెచ్ కుర్మయ్య, ఎస్ఐ, రాజోళి

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

మల్దకల్: రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రాజశేఖర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 18వ తేదీ వరకు భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు పట్టాదారుపాసు పుస్తకంతో పాటు బ్యాంకు ఖాతా జిరాక్సును ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలన్నారు. జూలై 2వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.



మల్దకల్‌లో రైతుబంధుకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలి

మానవపాడు: ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంతో నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రం, అమరవాయిలో ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండ్ల స్థలాల సాధనకోసం జూలై 3న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలు లేని వారికోసం కొనుగోలు చేసిన ఐదు ఎకరాల భూమిని, ఇంటి స్థలం లేని నిరుపేదలకు 125 గజాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజు, మాలిక్‌బాషా, రఫీ, రజాక్, రవి, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో మాట్లాడుతున్న రాజు

ధరూర్‌లో దంచి కొట్టిన వాన



ధరూరులో కురుస్తున్న వర్షం

ధరూరు: మండలంలో శనివారం సాయంత్రం భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. 6 గంటల నుంచి దాదాపు గంటన్నర పాటు కుండపోత వర్షం కురసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లగానే ఎండగా.. సాయంత్రం 5గంటల సమయంలో ఎండ కొట్టింది. కొన్ని రోజులుగా వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షం కురవడంపై రైతులు, కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎర్రబారిన పత్తి రైతులు ఇదే వర్షం కాస్త ముందుగా వచ్చి ఉంటే నష్టం జరిగేదికాదని అంటున్నారు.

మున్సిపాలిటీలో సీసీ రోడ్లకు ప్రాధాన్యత

అలంపూర్: మున్సిపాలిటిలో సీసీ రోడ్లకు తొలి ప్రాధాన్యత ఇస్తామని చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో సంతోష్‌నగర్, 6, 7 వార్డుల్లో చేపడుతున్న సీసీ రోడ్ల పనులను చైర్‌పర్సన్ శనివారం పరిశీలించారు. ఆయా వార్డుల్లో రూ.7 కోట్ల వ్యయంతో రోడ్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవలే జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించారన్నారు. ఇందులోనూ సీసీ రోడ్లకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఆమె వెంట వర్క్ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ సామేలు, మున్సిపల్ సిబ్బంది అనిల్, రమేష్ తదితరులు ఉన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏబీవీపీ నాయకులు

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబరాలను చేస్తూ ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రాజు ఆరోపించారు. జిల్లాలో మూడు రోజుల పాటు ఏబీవీపీ విస్తారక్ యోజనలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను సందర్శించినట్లు తెలిపారు. అనంతరం శనివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశాబ్ది కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వం విద్యారంగానికి అరకొర బడ్జెట్ కేటాయించిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన మౌలిక వసతులు, బోధన సిబ్బంది, యూనిఫాంలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో సురేష్, గణేష్, అశోక్, తేజ, నరేష్, అనిల్, సాగర్ తదితరులు ఉన్నారు.

డిమాండ్ల సాధనకై సంతకాల సేకరణ



రాజోళిలో కూలీలతో సంతకాలు తీసుకుంటున్న సిబ్బంది

రాజోళి: డిమాండ్ల సాధనలో భాగంగా ఉపాధి హామీ సిబ్బంది కూలీలతో సంతకాలు సేకరణ మొదలుపెట్టింది. శనివారం మండలంలోని సిబ్బంది కూలీలతో సంతకాలు సేకరించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి, చిన్న చూపు చూస్తుందన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కూలీలు పని చేస్తున్న చోటుకే వెళ్లి సంతకాలు సేకరించారు. ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని, మరణిస్తే వారి స్థానంలో ఆరు నెలల్లోగా కారుణ్య నియామకాలు చేపట్టాలని, ప్రతి ఆరు సంవత్సరాలు సీనియారిటీ ఉన్న వారికి అదనపు ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పేస్కేల్ వర్తింపచేయాలి

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సిబ్బందికి పే స్కేల్ వర్తింప చేయాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. శనివారం తప్పెట్లమొర్సుకు చెందిన ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తున్న చోట కాసేపు నిరసన తెలియజేశారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు ఉపాధి కూలీలు లేఖను రాశారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను ఆదుకుంటున్న సీఎం కేసీఆర్ ఉపాధి సిబ్బందిని గుర్తించి పేస్కేల్‌ను వర్తింప చేయాలని కోరారు. 200 మంది కూలీలు సంతకాలు చేసిన లేఖను సీఎం కేసీఆర్‌కు పంపారు. కార్యక్రమంలో ప్రసాద్, లత, జయమ్మ, గజ్జలన్న తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: ఉపాధి కూలీలకు కూలి పెంచి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అంజి కోరారు. నెలంతా పని చేసినా రూ.3వేలు రావడం లేదని తెలిపారు. కనీస వేతనంగా రూ.250 ఇవ్వాలని కోరారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల అర్బన్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్ తెలిపారు. శనివారం పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేదంటే జూలై 6 నుంచి జిల్లాలో ఉన్నటువంటి అన్ని రకాల పనులు చేసే పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్తారని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, డీపీఓను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, పద్మమ్మ, మధు, భీసన్న, అంజి, తిమ్మప్ప, మహేష్ తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

భూ వివాదంపై విచారణ

అలంపూర్ రూరల్: మండలంలోని కోనేరు శివారులోని సర్వే నంబర్ 10ఏలోని భూములపై శనివారం ఆర్ఐ మద్దిలేటి కలెక్టర్ ఆదేశాలపై విచారణ చేపట్టారు. 40 ఏళ్ల కింద లింగన్వాయికి చెందిన రవీంద్రగౌడ్ వద్ద భూమిని కొనుగోలు చేసి ఎల్లారెడ్డి, వాసరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మీరెడ్డి భూమిని చేసుకుంటున్నట్లు వారు తెలిపారు. కొంతమంది తమకు తెలియకుండా తమ భూమిని ఇతరులపై రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు లక్ష్మీరెడ్డి కుమారుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆర్ఐ పంచనామా చేయగా చుట్టు పక్కల పొలం వారిని, రైతులను అడుగగా 40 ఏళ్ల నుంచి నలుగురి కుటుంబసభ్యులే భూమిని చేసుకుంటున్నట్లు తెలిపారని ఆర్ఐ పేర్కొన్నారు.

పెన్షనర్లపై నిరంకుశ వైఖరి

గద్వాల అర్బన్: ప్రభుత్వం పెన్షనర్లపై నిరంకుశ వైఖరి అవలంభిస్తుందని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇక్బాల్ పాషా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెన్షన్‌దారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రెండు దశల ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతగా ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి వినతిపత్రం అందజేస్తామన్నారు. జిల్లాలోని పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు, ప్రభాకర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అయిజ: పాముకాటుకు గురై మృతిచెందిన కొత్తపల్లికి చెందిన అజయ్(15) కుటుంబ సభ్యులను బీఎస్పీ నాయకులు శనివారం పరామర్శించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడి కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విజయ్‌కుమార్, మధుగౌడ్, మహేందర్, నాగరాజు, నాయుడు ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



చరిత్ర వివరిస్తున్న ఉపాధ్యాయులు

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్ పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులను స్థానిక పురావస్తు శాఖ మ్యూజియం సందర్శింపజేశారు. మ్యూజియంలో ఉన్న విగ్రహాల చరిత్రను వివరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో క్యాతూర్ జీహెచ్ఎం బాలాజీ కృష్ణకుమార్, హెచ్ఎంలు శ్రీనివాసులు, సువిజ్ఞానం, బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సులేక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న విద్యార్థులు కంచుపాడు, తక్కశీల, ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల–1, 2 నుంచి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రూట్లలో బస్సులు తిరగకపోవడతో ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్నారు. పాఠశాలకు రావాలంటే ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నామని వాపోతున్నారు. సాయంత్రం వేళలో ఏ వాహనం లేక భయంభయంగా వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు తెలిపారు. ఒక ఆర్టీసీ బస్సు అయినా విద్యార్థుల కోసం నడిపించాలని కోరుతున్నారు.



ఉండవెల్లిలో ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

కొత్త బ్రిడ్జి పనులతో ఇక్కట్లు

అయిజ: పట్టణ కేంద్రంలో పెద్ద వాగుపై వంతెన పనులు చేపడుతున్న కారణంగా దారి మళ్లించడంతో రోడ్లు సరిగా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్టాండ్ నుంచి వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మిస్తున్నందున పశువుల దవాఖాన సమీపంలోని చిన్న బ్రిడ్జి రోడ్డును ప్రధాన రహదారిగా మార్చారు. చిన్న బ్రిడ్జి దాటిన తర్వాత రోడ్డు గుంతలు, బురదగా మారడంతో వాహనాలు సజావుగా వెళ్లకపోవడంతో ట్రాఫిక్‌జామ్ అవుతుంది. మున్సిపాలిటీ కమిషనర్, చైర్మన్ స్పందించి గుంతలమయమైన రోడ్డులో మొరం వేయించాలని పట్టణవాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నారులు, ప్రజలు తిరుగుతున్న సమయంలో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఉండవెల్లిలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు

ధరూరు: మండలంలోని ప్రధాన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంక్షేమ పథకాలు తెలియజేయాలి

అయిజ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చి తొమ్మిదేళ్లు అయిన సందర్భంగా మున్సిపాలిటీలో శనివారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా భరత్‌నగర్‌లో కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుమల్‌రెడ్డి, నరసింహయ్యశెట్టి, ప్రదీప్‌స్వామి, బండ శివన్న, రఘు, లక్ష్మన్న పాల్గొన్నారు.